భారత
కమ్యూనిస్టు పార్టీ
(మార్క్సిస్టు)

# రాజకీయ పరిణామాలపై నివేదిక

*(2025 సెప్టెంబర్ 13-15 తేదీలలో న్యూఢిల్లీలో*
*జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించినది.)*

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ కమిటీ

# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
# రాజకీయ పరిణామాలపై నివేదిక

***(2025 సెప్టెంబర్ 13-15 తేదీలలో న్యూఢిల్లీలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించినది.)***

## అంతర్జాతీయ పరిస్థితులు

2025 జూన్ 3-5 తేదీలలో జరిగిన కేంద్రకమిటీ సమావేశానంతరం అంతర్జాతీయంగా, జాతీయంగా అనేక కీలక పరిణామాలు సంభవించాయి. ఈ పరిణామాలు పార్టీ 24వ అఖిల భారత మహాసభలో చేసిన నిర్ధారణలు కచ్చితమైనవని రుజువు చేస్తున్నాయి.

1. సామ్రాజ్యవాద శక్తుల దన్నుతో పాలస్తీనాకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ చేపట్టిన జాతి హత్యాకాండ మరింత తీవ్రతరం అయింది. ఇజ్రాయిల్ సైనిక దళాలు గాజా పట్టణాన్ని పూర్తిగా ధ్వంసం చేసి ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకుంటున్నాయి. అలాగే ఇజ్రాయిల్ సెటిలర్లు వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్ల భూములను ఆక్రమించుకోవడానికి ప్రేరేపిస్తున్నారు.
2. ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడానికి అమెరికా కొన్ని ప్రయత్నాలు చేసింది, కానీ అవేవీ ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. నాటో విస్తరణ చర్యలను ఉపసంహరించుకోవడం, ఇరువైపులా మిలిటరీ మోహరింపులకు స్వస్తి చెప్పడం వినా శాంతిని నెలకొల్పడానికి వేరే మార్గాంతరం లేదు.
3. వివిధ దేశాలపై, ముఖ్యంగా లాటిన్ అమెరికా దేశాలపై అమెరికా తన ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి ప్రయత్నిస్తూ ఉన్నది. తాజాగా వెనిజులాను లక్ష్యంగా చేసుకున్నది.
4. వాణిజ్య షరతులు, ఒడంబడికలు కుదుర్చుకోవడానికి అమెరికా సుంకాల విధింపుని ఆయుధంగా వాడుకోవడం నానాటా పెరుగుతూ వస్తున్నది.
5. బహుళధ్రువాలను బలోపేతం చేసుకునే కృషి కొనసాగుతున్నది. తాజాగా జరిగిన 'బ్రిక్స్' 'షాంఘై కోపరేషన్' సమావేశాలు ఇందుకు తార్కాణం.
6. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సంక్షోభం కొనసాగుతున్నది. సామ్రాజ్యవాద శక్తులు తమ ఆధిపత్యాన్ని రుద్దడానికి చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి.

### భౌగోళిక రాజకీయ పరిణామాలు

**పశ్చిమాసియా:** పాలస్తీనాపై ఇజ్రాయిల్ జాతిహత్యాకాండను కొనసాగిస్తున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతాన్యాహుల మధ్య జరిగిన చర్చలలో గాజా నుండి పాలస్తీనియన్లను తరిమివేసి ఆ భూభాగాన్ని ఆక్రమించుకోవాలనే లక్ష్యం స్పష్టంగా తెలియవస్తున్నది. పశ్చిమాసియా భౌగోళిక సరిహద్దులను

తిరగరాయడం ద్వారా ఆ ప్రాంతంపై తన ఆధిపత్యాన్ని నిలుపుకోవాలనే తలంపుతోనే అమెరికా ఇజ్రాయిల్‌కు బేషరతుగా అండదండలు అందిస్తూ సహకరిస్తున్నది. ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఇరాన్ మీద అమెరికా వైమానిక దాడులకు పాల్పడింది. ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలను పూర్తిగా ధ్వంసం చేశాం అన్న అమెరికా ప్రకటనలను ఎవరూ విశ్వసించడం లేదు. అమెరికా ఈలక్ష్యాన్ని నెరవేర్చడంలో విఫలమయ్యింది అనే ఎక్కువమంది విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్ అణుశాస్త్రవేత్తలను, అత్యున్నత సైనికాధికారులను లక్ష్యంగా చేసుకుని హతమార్చడం, ఇరాన్ అణ్వాయుధకేంద్రంపై జరిగిన దాడుల మూలంగా ఇరాన్ మరింత పట్టుదలతో అణ్వాయుధాల తయారీకి కృషి చేసే అవకాశం ఉన్నది.

ఇజ్రాయిల్ ఎడతెరపి లేకుండా గాజా భూభాగం మీద బాంబులు కురిపిస్తూనే ఉన్నది. వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్ల మీద దాడి చేసి వారి భూములను లాక్కోవడానికి ఇజ్రాయిల్ సెటిలర్లను ప్రేరేపిస్తున్నది. గాజాలోకి మానవతా సాయం ప్రవేశించకుండా నిరోధిస్తూ ఆ ప్రాంత ప్రజానీకాన్ని ఆకలికి మాడ్చేస్తున్నది. క్షుద్బాధకు తాళలేక పిల్లలు, పెద్దలు మరణిస్తున్న వార్తలు కలిచి వేస్తున్నాయి. గాజాలో క్షామ పరిస్థితులు నెలకొన్నాయని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. గాజాలో నెలకొన్న దుర్భర పరిస్థితులను, ఇజ్రాయిల్ దాష్టీకాలను గురించి వార్తలు అందిస్తున్న జర్నలిస్టులను పథకం ప్రకారం ఇజ్రాయిల్ సేనలు హతమారుస్తున్నాయి. ఆఖరుకి ఆసుపత్రులను కూడా బాంబుదాడులతో ధ్వంసం చేస్తున్నారు. గాజా భూభాగం శిథిలాల కుప్పలా మారింది.

అంతర్జాతీయ న్యాయసూత్రాలు, దౌత్య ప్రమాణాలను అతిక్రమించి ఇజ్రాయిల్ కతార్ దేశంపై దాడులు చేసింది. అది కూడా తక్షణ కాల్పుల విరమణ కోసం చర్చలు జరుగుతున్న నేపథ్యంలో. పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని నెలకొల్పాలన్న ఆకాంక్ష ఇజ్రాయిల్‌కు ఏకోశానా లేదని, ఇజ్రాయిల్ పచ్చి ధూర్త రాజ్యంలా వ్యవహరిస్తున్నదని ఈ దాడులు నిరూపిస్తున్నాయి. శాంతి నెలకొల్పడం కోసం మధ్యవర్తిత్వం వహిస్తున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తొలిసారిగా వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిలీల దురాక్రమణ దాడులను ఖండించింది. ఇజ్రాయిల్ ఇదే విధమైన పోకడలు కొనసాగిస్తూ పోయిన పక్షంలో, అమెరికా ఇజ్రాయిల్ దుందుడుకు చర్యలను నిలవరించని పక్షంలో 'అబ్రహం ఒప్పందాలు'కే మోసం వస్తుందని హెచ్చరించింది. వాస్తవానికి అరబ్ దేశాలన్నీ అమెరికాతో అంటకాగుతూ పాలస్తీనా ప్రజాప్రయోజనాలు పరిరక్షించడంలో విఫలమయ్యాయి.

**ట్రంప్–పుతిన్ శిఖరాగ్ర సమావేశం :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉక్రెయిన్ యుద్ధం గురించి చర్చల కోసం అలాస్కాలో సమావేశమయ్యారు. మూడు గంటల సుదీర్ఘ చర్చల అనంతరం కూడా ఎలాంటి ఒప్పందం కుదరలేదు. ట్రంప్ మాత్రం 'తగు మాత్రం పురోగతి' సాధించాం ఇక యుద్ధానికి ముగింపు పలకడం, శాంతిని పునరుద్ధరించడం అనేది ఉక్రెయిన్ అధ్యక్షుడు, ఐరోపా దేశాల నిర్ణయం మీద ఆధారపడి

ఉంటుంది అని ప్రకటించాడు. తదనంతరం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, యూరప్ దేశాధినేతలతో ట్రంప్ భేటీ అయ్యాడు.

26 యూరప్ దేశాలు ఉక్రెయిన్ రక్షణకు హామీ పడతాం అనీ, అమెరికా ఇందుకు గ్యారంటీగా నిలవాలని ప్రకటించాయి. అమెరికా మాత్రం తాను ఉక్రెయిన్‌కు ఇంకెంత మాత్రం ఆయుధాలు సరఫరా చెయ్యనని, కావాలంటే ఐరోపా దేశాలు మాదగ్గర ఆయుధాలు కొనుగోలు చేసి తమవంతుగా ఉక్రెయిన్‌కు సాయం చేసుకోవచ్చని ప్రకటించింది. ఈ ప్రతిపాదనకు అనుగుణంగా జూన్ నెలలో జరిగిన నాటో దేశాల సదస్సులో సభ్యదేశాలన్నీ అమెరికానుండి ఆయుధాల కొనుగోలుకు ఈ ఏడాది చివరి నాటికి ఆయా దేశాల స్థూల జాతీయోత్పత్తిలో 2 శాతం కేటాయించాలని, 2035 నాటికి దీనిని 5 శాతానికి పెంచాలన్న నిర్ణయాన్ని ప్రకటించాయి.

ఉక్రెయిన్‌లో నాటో దేశాల సైన్యం ఉనికిని 'రెచ్చగొట్టుడు చర్య'గా పరిగణిస్తాం అని రష్యా హెచ్చరించింది. నాటోను తూర్పుదిశగా విస్తరించాలనే తలంపునకు స్వస్థి చెప్పడం, అమెరికా, ఐరోపా యూనియన్ దేశాలు ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరాలు నిలిపివెయ్యడం ద్వారా మాత్రమే యుద్ధానికి మూలకారణాన్ని పరిష్కరించి, శాంతికి దోహదం చేస్తాయి.

**వెనిజులాకు అమెరికా బెదిరింపులు :** మాదకద్రవ్యాల రవాణా అరికట్టే పేరిట అమెరికా వెనిజులా సముద్ర తీరప్రాంతంలో యుద్ధనౌకలు మోహరించింది. వాస్తవానికి ఇది వెనిజులాలో రాజకీయార్థిక జోక్యానికి ఉద్దేశించినదే. బొలివర్ విప్లవ విజయం సాధించిన వెనిజులా గతంలో అనేకమార్లు అమెరికా బెదిరింపులను ఎదుర్కొని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నికరంగా నిలబడింది. వెనిజులా సార్వభౌమత్వాన్ని దెబ్బ తీసే అమెరికా చర్యలను ఖండిచాలి. అమెరికన్ సేనలు ఆ ప్రాంతం నుండి ఉపసంహరించబడాలి. వెనిజులాపై విధించిన అక్రమ ఆర్థిక ఆంక్షలను తక్షణమే ఉపసంహరించాలి.

**సుడాన్ లో పౌర అంతర్యుద్ధం :** సుడాన్ లో జరుగుతున్న పౌర అంతర్యుద్ధంలో దాదాపు 1,50,000 మంది పౌరులు హతమారిపోయినట్లు, కోటి ముప్పై లక్షల మంది నిర్వాసితులుగా మారినట్లు తెలియవస్తున్నది. వీరంతా కష్టజీవులు, పేదలే. ఈ అంతర్యుద్ధం మూలంగా 70 నుండి 80 శాతం వైద్యసేవలు బంద్ అయ్యాయి. జాతి హత్యాకాండకు బలవుతున్నవారందరూ కష్టజీవులే. ఈ హత్యకాండకు, లైంగిక హింసకు ఇరుపక్షాల సాయుధ గ్రూపులే బాధ్యత వహించాలి. సూడాన్‌లోని సహజ వనరులు కొల్లగొట్టాలనే దుర్బుద్ధితో సామ్రాజ్యవాద దేశాలు ఈ మారణహోమాన్ని ఎగదోస్తున్నాయి. సుడాన్ పరిణామాలు ఆఫ్రికా ఖండంలో శాంతికి, ఆయాదేశాల సార్వభౌమత్వానికి విఘాతం కలిగిస్తున్నాయి.

**బహుళధృవ ప్రపంచం దిశగా అడుగులు షాంఘై కోపరేషన్ ఆర్గనైజేషన్ (యస్.సి.ఒ) సమావేశం :** టియాన్జిన్ (చైనా)లో ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీలలో రెండు రోజుల పాటు జరిగిన సమావేశం గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ దాడిని, పహల్‌గావ్, బెలూచిస్థాన్ లలో జరిగిన ఉగ్రవాదదాడులను ఖండిస్తూ ఒక సంయుక్త ప్రకటన

విడుదల చేసింది. రష్యాతో సంబంధాలు తెంచుకోవాలని హెచ్చరిస్తూ వివిధ దేశాలమీద అమెరికా సుంకాలు విధించడాన్ని ఈ సమావేశం తీవ్రంగా ఖండించింది. దక్షిణాది దేశాల ఆర్థిక ప్రయోజనాలు ఈడేర్చడానికి గాను యస్.సి.ఒ బ్యాంక్ ను నెలకొల్పుతానని చైనా ప్రకటించింది. అంతర్జాతీయ న్యాయసూత్రాలకు కట్టుబడి ఉండడం, ఘర్షణలను నివారించడం, శాంతిని నెలకొల్పడం, బహుళధృవ ప్రపంచాన్ని బలోపేతం చెయ్యడానికి కృషి చెయ్యాలని సంయుక్త ప్రకటనద్వారా ప్రతిన బూనాయి.

అంతర్జాతీయ సమస్యలపై షాంఘై కోపరేషన్ ఆర్గనైజేషన్ తీసుకున్న వైఖరిని, చైనా, రష్యా, భారత్‌లు ఉమ్మడి వేదిక మీదకు రావడాన్ని దక్షిణాది దేశాలు సానుకూలంగా పరిగణిస్తున్నాయి. అయితే బహుళధృవ ప్రపంచాన్ని బలోపేతం చేసుకోవడం, దక్షిణాది దేశాల ఉమ్మడి ప్రయోజనాలు కాపాడుకోవడంలో భారతదేశం తన వంతు పాత్ర నికరంగా, చిత్తశుద్ధితో పోషిస్తుందా లేదా అనే అంశం మీద భావి పరిణామాలు ఆధారపడి ఉంటాయి.

షాంఘై కోపరేషన్ ఆర్గనైజేషన్ దేశాల సమావేశం మీద ట్రంప్ ఆగ్రహావేశాలతో స్పందించాడు. ఈ దేశాలు అమెరికాకు వ్యతిరేకంగా కుట్ర చేస్తున్నాయి అని ఆరోపించాడు. ఎస్.సి.ఒ సమావేశం విజయవంతం కావడం వాషింగ్టన్‌కు తీవ్ర ఇబ్బందికరంగా పరిణమించింది. అమెరికన్ ఆధిపత్యధోరణులతో విసిగిపోయిన వివిధ దేశాలు చైనా, రష్యా ఛత్ర ఛాయకు చేరడంతో అమెరికా కలవరపడుతున్నది.

**'బ్రిక్స్ ప్లస్' :** బ్రిక్స్ ప్లస్ కూటమిలో ఉన్న సభ్య దేశాలు వాణిజ్యం తదితర రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకుంటూ బహుళ ధృవ ప్రపంచం కోసం కృషి చేస్తున్నాయి. ఇది ఇప్పటికీ బలంగా ఉన్నప్పటికీ, అమెరికా ఆధిపత్యానికి సవాలుగా మారింది. బ్రిక్స్ ప్లస్ కూటమి దేశాల ప్రభావం ఇతర దేశాల మీద కూడా పడుతుండడం అమెరికాకు వణుకు పుట్టిస్తున్నది. దీంతో గంగవెర్రులెత్తిపోయిన అమెరికా బ్రెజిల్, భారత దేశాల మీద 50 శాతం సుంకాలు, దక్షిణాఫ్రికా మీద 30 శాతం సుంకాలు విధించింది. బ్రిక్స్ దేశాల కూటమి అమెరికా ఆధిపత్యానికి ప్రత్యక్ష సవాలుగా మారింది కాబట్టి ఆ కూటమి దేశాలన్నింటి మీదా 10 శాతం సుంకాలు విధిస్తానని బెదిరిస్తున్నాడు. డాలర్‌ను మారకద్రవ్యంగా వినియోగించని దేశాలపై ఈ వేటు తప్పదని హుంకరిస్తున్నాడు. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు, అమెరికన్ బంటు అయిన జైర్‌బోల్సొనారో మీద జస్టిస్ డిపార్ట్‌మెంట్ (న్యాయశాఖ) కేసు బనాయించి విచారణ మొదలు పెట్టడంతో అమెరికా బ్రెజిల్ దేశం మీద 50 శాతం సుంకాలు విధించింది.

## అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థ

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ గణనీయమైన స్థాయిలో ఎదురుగాలులు ఎదుర్కొంటున్నది. 2025లో అంతర్జాతీయ వాణిజ్యం కేవలం 0.9 శాతం మాత్రమే పెరగనున్నదని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్లూటిఓ) అంచనా వేసింది. గతంలో ఈ అంచనా 2.7 శాతంగా ఉండింది. అమెరికా మొదలుపెట్టిన సుంకాల పోరుతో ఈ ఆర్థిక సవాళ్ళు

మరింత పెచ్చరిల్లాయి. మార్కెట్‌లో తీవ్ర అనిశ్చితి నెలకొన్నది. ఈ అనిశ్చితి మూలంగా వర్ధమాన దేశాలు, ఇంకా అభివృద్ధి చెందని దేశాలు తీవ్రంగా దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయి.

**సుంకాలను ఆయుధంగా మలుచుకున్న అమెరికా :** అమెరికా నిర్దేశించిన వాణిజ్య షరతులకు అంగీకరించని దేశాల మీద ప్రతీకార సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరిస్తున్నాడు. 2025 ఆగస్టు 1 నాటికి అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందాలు కుదుర్చుకోని దేశాల మీద ప్రతీకార సుంకాల విధింపు తప్పదని వివిధ దేశాల ప్రభుత్వాలకు లేఖలు పంపాడు. ఇది సామ్రాజ్యవాద దురహంకార ధోరణి తప్ప మరొకటికాదు. ఉక్రెయిన్ యుద్ధం చాలించి శాంతి ఒప్పందం కుదుర్చుకోకపోతే రష్యా మీదా, రష్యాతో వాణిజ్యం నెరపే దేశాల మీద 100శాతం సుంకాలు విధిస్తానని బీరాలు పలికాడు. అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా వివిధ రంగాలలో అమెరికన్ దిగుమతులను అనుమతిస్తామని మోడీ ప్రభుత్వం రాజీ ధోరణి ప్రదర్శించినా మనదేశం మీద 50 శాతం సుంకాలు విధించాడు.

**ఐరోపా యూనియన్ తో వాణిజ్య ఒప్పందం :** అమెరికాకు అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్న ఐరోపా యూనియన్ దేశాల మీద బలవంతంగా వాణిజ్య ఒప్పందాలను రుద్దాడు. ఆ దేశాల దిగుమతుల మీద 30శాతం సుంకాలు విధిస్తానని బెదిరించి దారికి తెచ్చుకుని 15 శాతం సుంకాలు విధించాడు. గతంలో ఈ సుంకాలు 10శాతంగా ఉండేవి. ఐరోపా నుండి దిగుమతుల మీద చారిత్రకంగా ఇంత భారీ సుంకాలు విధించడం ఇదే మొదటిసారి. ఈ ఒప్పందంలో భాగంగా రాబోయే మూడేళ్ళలో ఐరోపా యూనియన్ దేశాలు అమెరికా నుండి 750 బిలియన్ డాలర్లు విలువ చేసే చమురు, సహజ వాయువు, అణు ఇంధనాలు కొనుగోలు చెయ్యాలి. రష్యా నుండి చౌక ధరకు లభించే చమురు, సహజవాయువులకు బదులు అమెరికన్ బహుళజాతి కంపెనీల నుండి ఎక్కువ ధర చెల్లించి కొనుగోళ్ళు చెయ్యాల్సిన దుస్థితికి ఐరోపా యూనియన్ దేశాలు నెట్టబడ్డాయి. ఇదికాక ఈ దేశాలు అమెరికాలో మరో 600 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టడానికి ఒప్పించబడ్డాయి.

**అమెరికా–చైనా వాణిజ్య సంబంధాలు :** ఈ రెండు దేశాలూ ఇంకా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలకు దారి తియ్యకుండా ఉండడానికి చైనా మీద ప్రకటించిన సుంకాలను మరో 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించాడు. చైనా అమెరికా నుండి చేసుకునే సోయాబీన్ దిగుమతులను 11.5 శాతం తగ్గించుకుని బ్రెజిల్ నుండి 13.9 శాతం హెచ్చు దిగుమతులు చేసుకున్నది. 2018 ముందు వరకు చైనాకు సోయాబీన్ ఎగుమతి చేసే నంబర్‌వన్ దేశం అమెరికా. చైనా మీద అమెరికా విధించిన సుంకాలకు ప్రతీకారంగా అమెరికా సోయాబీన్ దిగుమతుల మీద చైనా 10శాతం సుంకాలు విధించింది. అంతర్జాతీయ సంస్థల అంచనాలను

తల్లక్రిందులు చేస్తూ 2025 తొలి అర్థ సంవత్సరంలో చైనా 5.3 శాతం స్థూల జాతీయోత్పత్తి వృద్ధిని సాధించింది.

2025 మే నెల నుండి చైనా అమెరికా నుండి క్రూడాయిల్ దిగుమతులను పూర్తిగా నిలిపివేసింది. రష్యా నుండి దిగుమతులు పెంచుకున్నది. సగటున ఈ ఏడాదిలో జూలై నాటికి రష్యా నుండి క్రూడాయిల్ కొనుగోళ్ళు 16.8 శాతం పెరిగాయి. సౌదీ అరేబియా నుండి క్రూడాయిల్ కొనుగోళ్ళు కూడా పెరిగాయి.

**అమెరికాలో నూతన తరహా ఆర్థిక నియంత్రణలు :** ఆగస్టు నెల మధ్యకాలంలో అమెరికన్ ప్రభుత్వం విదేశీ ఉత్పత్తిదారుల పోటీలో దెబ్బతింటున్న అమెరికన్ సెమీకండక్టర్ ఉత్పత్తి కంపెనీలో 10 శాతం వాటా కొనుగోలు చేసింది. స్వదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడానికి ఈ రంగంలో కంపెనీలకు 20 బిలియన్ డాలర్లు గ్రాంట్లు, రుణాల రూపంలో అందించాలని బైడెన్ ప్రభుత్వహయాంలో రూపొందించిన 'చిప్స్ చట్టం' పేర్కొన్నది. 'చిప్' తయారీలో ఆసియా మీద ఆధారపడడాన్ని తగ్గించి అమెరికన్ కంపెనీలకు ప్రోత్సాహకాల పేరిట పైన పేర్కొన్న గ్రాంట్లు, రుణాలేగాక సబ్సిడీలు కూడా ప్రకటించారు.

అమెరికన్ ఉక్కు ఉత్పత్తి కర్మాగారాన్ని జపాన్ కంపెనీ 'టేకోవర్' చెయ్యడానికి అనుమతి ఇస్తూనే జపాన్ కంపెనీ నిర్ణయాధికారాల్లో జోక్యం చేసుకునే రీతిలో తనకూ 'గోల్డెన్ షేర్' ఇవ్వాలని ట్రంప్ ప్రభుత్వం మెలికపెట్టి ఆ మేరకు వాటాలు పొందింది. మేలైన సామర్థ్యంగల అయస్కాంతాల తయారీకి వినియోగించే ఖనిజ ఉత్పత్తి కంపెనీలో పెంటగాన్ 15 శాతం వాటాలు కైవసం చేసుకున్నది. చైనాకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమ్మదలచిన అమెరికన్ కంపెనీలు తమ రాబడిలో కొంత వాటాను అమెరికన్ ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశించారు. 'సార్వభౌమ సంపద నిధి' పేరిట కొత్తగా ఒక 'ఫండ్'ను రూపొందించి ప్రభుత్వ పెట్టుబడులను దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేసే వ్యూహాత్మక రంగాలకు మళ్ళించాలని నిర్ణయించింది.

ట్రంప్ తన ప్రభుత్వ అజెండాకు అనుగుణంగా వడ్డీ రేట్లను తగ్గించాలని ఫెడరల్ రిజర్వ్ (మన రిజర్వ్ బ్యాంక్ వంటిది)ను ఒత్తిడి చేస్తున్నాడు. ఫెడరల్ బోర్డు గవర్నర్లు వడ్డీరేట్ల తగ్గింపుకు అంగీకరించక పోవడంతో కేంద్ర బ్యాంక్ స్వయం ప్రతిపత్తిని ఖాతరు చెయ్యకుండా బోర్డు గవర్నరును తొలగించినట్లు ప్రకటించాడు. కానీ కోర్టు ఆ తొలగింపు చెల్లనేరదని తీర్పు ఇచ్చింది. బోర్డులోని ఏడుగురు గవర్నర్లలో మెజార్టీని తప్పించి తనకు అనుకూలమైన వారిని నియమించుకుని పరపతి విధానాన్ని, వడ్డీరేట్లను తాను అనుకున్న దిశగా నడిపించాలని ప్రయత్నిస్తున్నాడు.

ఏతావాతా ట్రంప్ ప్రభుత్వం ప్రభుత్వ వనరులను ప్రైవేటు రంగ ప్రయోజనాల కోసం ఖర్చు చేసే దిశలో పని చేస్తున్నది. 2008-09 ఆర్థిక సంవత్సరంలో అమెరికా చవిచూసిన ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ప్రైవేటు బ్యాంక్, ఇన్సూరెన్స్, పారిశ్రామిక సంస్థలకు బిలియన్ల డాలర్ల కొద్దీ 'బెయిల్ అవుట్' ప్యాకేజీలు ఇచ్చినా ఆర్థిక వ్యవస్థ అంతర్గత సంక్షోభం

నుండి ఈనాటికీ తేరుకోలేదు. కాబట్టి ఇప్పుడు ట్రంప్ సర్కారు ఈ కొత్త మార్గాన్ని ఎంచుకున్నది.

## పచ్చి మితవాదశక్తుల పెరుగుదల

వలసలకు వ్యతిరేకంగా ఇంగ్లాండ్‌లో పచ్చి మితవాదశక్తులు భారీ ప్రదర్శన నిర్వహించారు. తదనంతరం పంజాబీ మూలాలు గల ఒక బ్రిటన్ పౌరురాలిని ఇద్దరు శ్వేతజాతి దురహంకారులు బలాత్కారం చేసి దేశం విడిచిపొమ్మని బెదిరించారు. బ్రిటన్‌లో మితవాద శక్తుల ప్రాబల్యం పెరుగుతూ వస్తుంది అనడానికి ఇవికొన్ని తార్కాణాలు. ప్రత్యామ్నాయ ఆర్థిక, సామాజిక విధానాలు అందిస్తామని వాగ్దానం చేసి కన్సర్వేటివ్ పార్టీని ఓడించి అధికారంలోకి వచ్చిన లేబర్ పార్టీ పాలనా వైఫల్యానికి ఈ పరిణామాలు అద్దం పడుతున్నాయి.

గత 15 ఏళ్ళలో అధ్యక్ష పదవికి వామపక్ష అభ్యర్థి లేకుండా బొలీవియాలో జరుగుతున్న తొలి ఎన్నిక ఇది. లాటిన్ అమెరికా దేశాల వామపక్షానికి ఇది పెద్ద ఎదురుదెబ్బ. ప్రస్థుతం పోటీ మితవాద–మధ్యేవాద అభ్యర్థులకు జరుగుతున్నది. అమెరికా జోక్యం నానాటికీ పెరుగుతుండడం మూలంగా లాటిన్ అమెరికాలో మితవాద శక్తులు బలం పుంజుకునే పరిస్థితులు నెలకొన్నాయి.

అమెరికాలో ఆఫ్రికన్–అమెరికన్లు, లాటిన్ అమెరికా, ఆసియా వాసులు, ఇతర ప్రవాసీయుల మీద వర్ణ వివక్షాపూరిత దాడులకు మద్దతుగా పెద్ద ఎత్తున జనసమీకరణ జరుగుతున్నది. ఈ మధ్యనే పంజాబీ ట్రక్‌డ్రైవర్ మీద దాడి జరిగింది. ఆఫ్రికన్–అమెరికన్‌ల హత్యలకు పాల్పడిన శ్వేత జాతీయులకు శిక్షలు విధించిన న్యాయమూర్తులను కూడా ఈ మితవాద శక్తులు తీవ్రంగా తప్పుబడుతున్నాయి. మితవాద భావజాల ప్రచారకుడు ఛార్లీకిర్క్ హత్య కావించిన వ్యక్తి రిపబ్లికన్ పార్టీ సభ్యత్వం కల కుటుంబానికి చెందినవాడు అన్న సంగతి బహిర్గతం అయినా ఈ హత్యోదంతాన్ని అడ్డం పెట్టుకుని అమెరికన్ ప్రభుత్వం వామపక్ష, అభ్యుదయ శక్తులను లక్ష్యంగా చేసుకుని దాడులు చెయ్యడానికి ప్రయత్నిస్తున్నది.

## నిరసనలు

ట్రంప్ అధికార యంత్రాంగం విధానాలకు వ్యతిరేకంగా లేబర్ డే నాడు అమెరికా అంతటా కార్మికవర్గం పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. గాజాలో జాతి హత్యకాండకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌కు అండగా నిలబడడానికి వ్యతిరేకంగా, పాలస్తీనా ప్రజలకు మద్దతుగా భారీ ప్రదర్శనలు జరిగాయి. వలస ప్రజానీకంపై దాడులకు తెగబడుతున్న పచ్చి మితవాద గ్రూపులకు ట్రంప్ అండగా నిలబడడాన్ని నిరసిస్తూ పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిగాయి.

**ఫ్రాన్స్:** బడ్జెట్‌లో ప్రకటించిన పొదుపు చర్యలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగడం, ఓటింగ్‌లో బడ్జెట్ ప్రతిపాదనలు వీగిపోవడంతో ప్రధాని తన పదవికి రాజీనామా చేశాడు.

**గ్రీస్ :** కన్జర్వేటివ్ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గ్రీస్ కార్మికవర్గం సమ్మె చేసింది.

**బ్రెజిల్ :** దేశ అంతర్గత వ్యవహారాలలో ట్రంప్ జోక్యానికి, 50 శాతం సుంకాల విధింపునకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన జరిగింది.

**ఇండోనేషియా :** ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా యువత ఆందోళనలకు పూనుకున్నది.

## నేపాల్ సంక్షోభం

జెన్‌జడ్ (యువత) ఆందోళనలతో నేపాల్ అట్టుడికిపోయింది. ప్రభుత్వం సామాజిక మాధ్యమాలపై విధించిన నిషేధం గతకొద్ది ఏళ్ళుగా అక్కడ ప్రజానీకంలో గూడు కట్టి ఉన్న అసంతృప్తి బద్దలు కావడానికి కేంద్ర బిందువుగా మారింది. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యునైటెడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్) – నేపాలీ కాంగ్రెస్ పార్టీల సంకీర్ణ ప్రభుత్వం అసమర్థ పాలన, ప్రజాసమస్యల పట్ల ఉపేక్షాభావం – ఈ రెండూ ప్రజలలో తీవ్ర అసంతృప్తికి దారి తీశాయి. కె.పి.ఓలి ప్రభుత్వం నిరసనకారులపై తీవ్ర నిర్బంధానికి, క్రూర అణిచివేతలకు పాల్పడింది. 50 మంది పౌరులు మరణించారు. పోలీసుల కాల్పులలో ఒక్కరోజునే 20 మంది ప్రాణాలు కోల్పోయారు. నిరసనకారులు పార్లమెంటు భవనాన్ని, సుప్రీంకోర్టును, దేశాధ్యక్షుడు, ప్రధాని సహా అనేక మంది రాజకీయ నాయకుల నివాసాలను అగ్నికి ఆహుతి చేసారు.

2008లో రాచరిక పాలనకు వ్యతిరేకంగా నేపాల్ ప్రజానీకం ఉవ్వెత్తున ఉద్యమించారు. భూసంస్కరణలు అమలయ్యి ఫ్యూడల్ అణిచివేత నుండి విముక్తి లభిస్తుందని ఆకాంక్షించారు. వాళ్ళ జీవితాలు మెరుగవుతాయనే ఆశతో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యూనైటెడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్ట్ సెంటర్)లకు అత్యధిక సీట్లు కట్టబెట్టారు.

రాజరిక పాలన కూలదోశాక గత 17 ఏళ్ళలో 14సార్లు ప్రభుత్వాలు మారాయి. వరుసవారీగా ఏర్పడిన ఈ ప్రభుత్వాలు ఏవీ కూడా దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించలేక పోవడమే తాజా పరిస్థితికి కారణం. ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీల అవకాశవాదం, అవినీతిలతో ప్రజలు విసిగి వేసారిపోయారు. ఉపాధి అవకాశాలు కరువవడంతో ప్రజలు పరాయి దేశాలకు వలస పోవాల్సిన స్థితికి నెట్టబడ్డారు.

మితవాద శక్తులు ముఖ్యంగా రాజరిక అనుకూల శక్తులు, ఆర్.యస్.యస్‌కు అనుబంధంగా ఉన్న గ్రూపులు ఈ అసంతృప్తిని బాగా సొమ్ము చేసుకున్నాయి. ఈ శక్తులు నేపాల్ లౌకిక ప్రజాస్వామికతత్వానికి రాజ్యాంగానికి వ్యతిరేకంగా నిరంతరాయంగా ప్రచారం చేస్తూ వచ్చాయి. ప్రజలలో నెలకొని ఉన్న అసంతృప్తి ఆగ్రహ జ్వాలలుగా మారడానికి

సామాజిక మాధ్యమాలపై విధించిన నిషేధం అగ్గిరవ్వగా తోడయ్యింది. సైన్యం జోక్యం చేసుకుని మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించింది.

నేపాల్ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీలా కార్కి మధ్యంతర ప్రధానిగా పదవీ స్వీకారం చేసిన దరిమిలా అధ్యక్షుదు పార్లమెంట్ ను రద్దుచేశాడు. ఆరు నెలలలో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రధాని ప్రకటించారు. అయితే గతంలో సుప్రీం కోర్టు రాజ్యాంగానికి ఇచ్చిన భాష్యాన్ని ఉదహరిస్తూ పార్లమెంటు రద్దు చెల్లనేరదు అని కొన్ని రాజకీయ పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి. మరలా ఎన్నికలు జరపడాన్ని ఈ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రస్తుత బలాబలాల ఆధారంగానే తిరిగి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నాయి. అయితే ఈ వాదనకు ప్రజల మద్దతు లేదు. నేపాల్‌లో నెలకొని ఉన్న సున్నితమైన పరిస్థితులను విదేశీ శక్తులు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం వాడుకునే అవకాశం ఉన్నదనే భయ సందేహాలూ వ్యక్తమవుతున్నాయి.

## పర్యావరణ మార్పులు

**కాప్–30 ఏర్పాట్లు :** పర్యావరణంపై ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యాన కాప్–30 సదస్సుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి, ప్రధాన సదస్సుకు సన్నాహకంగా వివిధ ఉప–అంశాలపై వేర్వేరు ప్రాంతాల్లో సదస్సులు వరుసగా నిర్వహిస్తున్నారు, అభివృద్ధి చెందిన దేశాలు స్వీయ ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించుకున్న అజెండాను వర్ధమాన దేశాలపై రుద్దడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. తద్వారా పర్యావరణ నష్టానికి తమ బాధ్యత నుండి తప్పించుకో చూస్తున్నాయి. ఇదే సందర్భంలో వివిధ దేశాలు 'జాతీయ నిర్ధారిత చేర్పుల' ప్రమాణాలను రూపొందించే పనిలో ఉన్నాయి. ఈ ప్రమాణాల ఆధారంగా కాప్–30 సదస్సులో చర్చలు జరిగే అవకాశం ఉన్నది.

**తీవ్ర పర్యావరణ పరిణామాలు :** ఈ మధ్యకాలంలో ప్రపంచ వ్యాప్తంగా పెనుతుఫానులు, వరదలు, కార్చిచ్చులు చెలరేగిపోయాయి. ఆయాదేశాల ప్రభుత్వాల సామర్థ్యానికి పరీక్ష పెట్టాయి. ఈ ఉత్పాతాల మూలంగా నష్టపోయిన దేశాలలో పర్యావరణ పరిరక్షణ, ఉత్పాతాల సందర్భంగా సహాయ పునరావాసాల కల్పనా సామర్థ్యాల పెంపు – ఈ రెండు అంశాలు రాజకీయ అజెండాలో అగ్ర స్థానంలోకి వచ్చాయి.

## జాతీయ పరిస్థితులు

**దేశంలో నెలకొన్న తాజా పరిణామాలు ప్రధానంగా ఇవీ –**

1. బిజెపి నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం నయా ఉదారవాద అజెండాను దూకుడుగా అమలు చేస్తున్నది.
2. అమెరికాను బుజ్జగించడానికి అన్నివిధాలా ప్రయత్నిస్తోంది కానీ ఫలితం దక్కడంలేదు. తమ ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకపోతే బ్రిక్స్, షాంఘై కోపరేషన్ వంటి బహుళ ధృవ కూటములను ప్రత్యామ్నాయంగా ఎంచుకోవాల్సి వస్తుంది అని అమెరికాకు సంకేతాలు ఇస్తున్నది.

3. రాజ్యాంగబద్ధంగా స్వయం ప్రతిపత్తితో వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం వంటి సంస్థలు ఆర్.యస్.యస్ అజెండాకు అనుగుణంగా పనిచేస్తున్నాయి. బీహార్ ఓటర్ల జాబితాలో చేపట్టిన స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్ ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ.
4. బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వాల వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి ఆర్.యస్.యస్ దాని అనుబంధ సంస్థలు కాశీ, మధుర ఆలయ వివాదాలను తిరిగి రేపుతున్నాయి.
5. బిజెపి ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా పెరుగుతున్న ప్రజా అసంతృప్తికి జూలై 9 సార్వత్రిక సమ్మె విజయవంతమైన తీరు అద్దం పడుతున్నది.
6. సుదీర్ఘ విరామం తరువాత 'ఇండియా' వేదిక రాజకీయపక్షాలు సమావేశమయ్యాయి.

**బలోపేతం అవుతున్న నిరంకుశ:** బీహార్‌లో ఎన్నికల జాబితాలో ప్రత్యేక సవరణ (SIR) చేపట్టాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈ క్రమంలో అనేక లొసుగులు చోటు చేసుకున్నాయి. వేలాది మంది పౌరులకు రాజ్యాంగం దఖలు పరిచిన ఓటు హక్కును ఊడబెరికారు. ఎన్నికల సంఘం ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా అమలు చెయ్యాలని చూస్తున్నది. ఎన్నికల జాబితా సవరణ పేరిట ఎన్నికల సంఘం ఓటర్ల పౌరసత్వాన్ని నిర్ధారించడానికి ప్రయత్నిస్తున్నది. ఇది రాజ్యాంగ ఉల్లంఘనే. ఎన్నికల సంఘానికి పౌరసత్వాన్ని నిర్ధారించే అధికారం లేదు. ఎన్నికల జాబితా నుండి విదేశీయుల ఏరివేత పేరిట మైనార్టీలు ఇతర అణగారిన వర్గాల ప్రజల ఓటుహక్కును పెద్దఎత్తున తొలగించడానికి ఎన్నికల సంఘం ప్రయత్నిస్తున్నది. బిజెపి ప్రభుత్వం తలపెట్టిన జాతీయ పౌరసత్వ పట్టిక తయారీని కోవిడ్ ఉత్పాతానికి ముందు ప్రజలు పెద్ద ఎత్తున ప్రతిఘటించారు.

ఇప్పుడు ఎన్నికల సంఘం దొడ్డిదోవన అదే ప్రక్రియను అమలు చెయ్యడానికి ప్రయత్నిస్తున్నది. ఎన్నికల సంఘం గత కొంతకాలంగా బిజెపి పాలిత ప్రభుత్వాల కొమ్ముకాస్తూ వస్తున్నది. ఇప్పుడు ఏకంగా ఆర్.యస్.యస్/సంఘ్‌పరివార్ అజెండాను ముందుకు తీసుకుపోవడానికి ప్రయత్నిస్తున్నది.

బీహార్ ఎన్నికల జాబితా నుండి తొలగించిన 6.5 లక్షల మంది ఓటర్ల వివరాలను ప్రచురించాలని సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తొలగింపునకు గల కారణాలను కూడా పేర్కొనమని కోరింది. ఈ మొత్తం వ్యవహారంలో ఎన్నికలసంఘం ఏ మాత్రం పారదర్శకత పాటించని నేపధ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఆహ్వానించదగిన సానుకూల పరిణామంగా భావించాలి. ఎన్నికల సంఘం తొలగించిన ఓటర్ల జాబితా విశ్లేషిస్తే మెజార్టీ ప్రజానీకం ముస్లింలు, మహిళలు, పేదవర్గాలకు చెందినవారే అని స్పష్టమవుతున్నది. దీనితో బీహార్ ప్రజానీకంలో పెద్ద ఎత్తున అసంతృప్తి వెల్లువెత్తింది. ప్రతిపక్షపార్టీలు అన్నీ ఐక్యంగా ఈ ప్రక్రియను వ్యతిరేకించాయి.

రాజ్యాంగపరంగా స్వయం ప్రతిపత్తి గల ఎన్నికలసంఘం ఈవిధంగా పక్షపాత ధోరణులతో ఆర్.యస్.యస్ అజెండాను అమలు చేస్తున్న తీరును ఎండగడుతూ ప్రజలలో

పెద్ద ఎత్తున ప్రచారం చెయ్యాలి. ప్రజాస్వామిక హక్కు మీద జరుగుతున్న ఈ దాడిని తిప్పికొట్టాలి. ఎన్నికల సంఘం ఆర్.యస్.యస్ జేబు సంస్థగా మారుతున్న వైఖరిని ప్రజాసమీకరణ ద్వారా నిలవరించాలి.

బీహార్ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా పార్లమెంటు లోపలా, వెలుపలా పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. ప్రజల ఓటు హక్కును పరిరక్షించడానికి ప్రతిపక్ష రాజకీయ పార్టీలన్నీ ఏకోన్ముఖంగా కదలడం సానుకూల పరిణామం. ఈ అంశంపై ఇండియా వేదిక పార్టీలు చాలా కాలం తర్వాత సమావేశం కావడం కూడా ఆహ్వానించదగిన పరిణామమే. బీహార్‌లో కాంగ్రెస్–ఆర్జేడి, వామపక్ష పార్టీల 'మహాఘటబంధన్' నేతృత్వాన బీహార్‌లోని 25జిల్లాల గుండా 16 రోజుల పాటు 'ఓటర్ అధికార యాత్ర' సాగింది. సెప్టెంబరు 1వ తేదీన పాట్నాలో భారీ బహిరంగ సభ జరిదింది.

ఓటరు రిజిస్ట్రేషన్‌కు ఆధార్ కార్డును ప్రామాణిక పత్రంగా పరిగణించాలని సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ ఆదేశాలు సక్రమంగా అమలు జరిగేలా చూసి అర్హత కలిగిన ఓటరు ఎవరూ ఓటు హక్కు కోల్పోకుండా చూడడం మన బాధ్యత.

**ప్రజా భద్రత పేరిట మహారాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు :** ప్రజా భద్రత పేరిట మహారాష్ట్రలోని బిజెపి శివసేన–ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు ప్రజల ప్రజాస్వామిక హక్కుల మీద తీవ్రదాడికి ఉద్దేశించినదే. వామపక్ష ఉగ్రవాద శక్తులను అరికట్టే పేరిట రూపొందించిన ఈ బిల్లు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే నిరసన గళాలను ప్రజాభద్రత, జాతీయ భద్రతల పేరిట అణిచివేసేందుకు ఉద్దేశించినదే. వామపక్ష తీవ్రవాద శక్తులు, తదితర శక్తులు అన్న పదానికి సరైన నిర్వచనం ఇవ్వకుండా ఉండడం ద్వారా రాజకీయ ప్రత్యర్థి శక్తులను వేటినైనా లక్ష్యంగా చేసుకుని వేధించాలనేదే ప్రభుత్వ పన్నాగం. అసమ్మతిని, ప్రతిపక్షపార్టీలను అణగదొక్కేందుకు ఈ బిల్లును దుర్వినియోగం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**అప్రజాస్వామిక బిల్లులు :** ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు 30 రోజుల పాటు కస్టడీలో ఉంటే వారిని ఆ పదవుల నుండి తప్పించేందుకు ఉద్దేశించిన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. న్యాయపరమైన ప్రక్రియను పూర్తిగా ఉపేక్షించే ఈ బిల్లు ప్రభుత్వ అప్రజాస్వామిక ధోరణులకు అద్దం పడుతున్నది. న్యాయవివేచనను పక్కకి తప్పించి హీన చట్టాలను ముందుకు నెట్టడానికి బిజెపి గతం నుండి అనేక ప్రయత్నాలు చేస్తూనే వచ్చింది. నయా ఫాసిస్టు ధోరణులు కలిగిన బిజెపి ప్రభుత్వం సదరు బిల్లును అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తున్నది. ఇది ప్రజాస్వామ్యానికి మూలధాతువు అయిన అధికార విభజనలను అతిక్రమిస్తున్నది.

**న్యాయవ్యవస్థలో పెరుగుతున్న అసంబద్ధ ధోరణులు :** చాలా కీలకమైన కేసులలో న్యాయవ్యవస్థ అసంబద్ధంగా వ్యవహరించడం ఆందోళన కలిగించే అంశం.

**బెయిల్ నిరాకరణ :** ఉమర్ ఖలిద్, షార్జిల్ ఇమామ్ సహా మరో ఎనిమిది మంది దాఖలు చేసుకున్న బెయిల్ పెటిషన్లను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. 2020 ఫిబ్రవరిలో ఢిల్లీలో చెలరేగిన మతఘర్షణలలో వీరి ప్రమేయం ఉందన్న తప్పుడు అభియోగాలతో 'ఉపా' చట్టం కింద అరెస్టు కాబడిన వీరంతా ఎలాంటి విచారణకు నోచుకోకుండా ఐదేళ్ళుగా జైల్లో మగ్గిపోతున్నారు. వీరి బెయిల్ పిటిషన్లను తిరస్కరించడం ఇది ఐదవసారి. ఇప్పటివరకు వీళ్ళలో ఎవరి మీదా చార్జిషీట్ దాఖలు చెయ్యకపోవడం మరింత ఆందోళన కలిగించే అంశం. ఢిల్లీ హైకోర్టు నిర్ణయం సహజ న్యాయానికి తూట్లు పొడవడమే.

**మాలెగావ్ బాంబు పేలుళ్ళ నిందితుల విడుదల :** మాలెగావ్ బాంబు పేలుళ్ళ నిందితులకు వ్యతిరేకంగా సరైన సాక్ష్యాధారాలు లేవన్న కారణంతో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ (యన్.ఐ.ఎ) ట్రయల్ కోర్టు ముద్దాయిలు అందరి విడుదలకు అదేశించింది. నిందితులకు తగిన శిక్షలు పడేలా చూడడంలో ప్రాసిక్యూషన్, ప్రభుత్వము రెండూ విఫలమయ్యాయి. ఈ కేసులో హైకోర్టుకు అప్పీల్ చేసే అవకాశం ఉన్నా మహారాష్ట్ర ప్రభుత్వం ఆ పని చెయ్యలేదు. ఎందుకంటే విడుదలయిన ముద్దాయిలు అందరూ హిందూత్వ ఉగ్రవాద వ్యక్తులు కాబట్టి.

ఇదే మహారాష్ట్ర ప్రభుత్వం 2006లో ముంబైలో జరిగిన రైలు పేలుళ్ళ కేసులో బొంబాయి హైకోర్టు తీర్పును సవాలు చేసింది. ఈ కేసులో బొంబాయి హైకోర్టు నిర్దోషులుగా విడుదల చేసినవారు ఎక్కువ మంది ముస్లింలు కాబట్టి మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేసువేసి మరీ హైకోర్టు తీర్పుపై 'స్టే' తీసుకువచ్చింది.

బిజెపి నాయకత్వాన నడుస్తున్న మహారాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతపక్షపాత ధోరణులకు ఇది తార్కాణం. మాలెగాం బాంబు పేలుళ్ళ కేసులో విడుదలయిన నిందితుల మీద చట్ట ప్రకారం విచారణ జరగాలని, తగిన శిక్షపడాలని కోరేలా ప్రజాభిప్రాయాన్ని మలచాలి. యన్.ఐ.ఎ. కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా మహారాష్ట్ర సర్కారు సుప్రీంకోర్టులో కేసు కట్టేలా చూడాలి.

**అనవసర వ్యాఖ్యలు :** కొంతమంది న్యాయమూర్తులు కేసు వేసిన కక్షిదారులను ఉద్దేశించి అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ఆ న్యాయమూర్తుల పక్షపాత ధోరణులను వెల్లడి చెయ్యడంతో పాటు ప్రజాభిప్రాయం మీద కూడా ప్రభావం చూపించే అవకాశం మెండుగా ఉంటుంది. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించడానికి ముంబై పోలీసులు అనుమతి నిరాకరించడంతో మార్క్సిస్టు పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. బొంబాయి హైకోర్టు పిటిషన్ కొట్టివేస్తూ ఆర్డరు జారీ చేస్తూ కొన్ని మనపార్టీపై వ్యాఖ్యలు చేసింది. వాస్తవానికి రాతపూర్వక ఆర్డరులో ఆ వ్యాఖ్యలు లేవు. పోలీసులు పదే పదే అనుమతులు నిరాకరించడంతో పార్టీ తిరిగి హైకోర్టును ఆశ్రయించింది. కోర్టు తన పాత వైఖరిని సవరించుకుని నిరసన ప్రదర్శనకు అనుమతి ఇమ్మని పోలీసు శాఖను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**జమ్ము–కాశ్మీర్ :** జమ్ము–కాశ్మీర్ గవర్నరు మీడియాకు ఇంటర్వ్యూ ఇస్తూ భద్రతా వైఫల్యం కారణంగానే పహల్‌గామ్‌లో ఉగ్రవాద దాడులు జరిగాయని అంగీకరించారు. కేంద్రపాలిత ప్రాంతంగా మార్చినందున జమ్ము–కాశ్మీర్ కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పర్యవేక్షణలో నడుస్తున్నది. భద్రతా వ్యవహారాలు, శాంతిభద్రతల పర్వవేక్షణా సమావేశాలకు ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రిని సైతం పిలవడంలేదు. కాశ్మీర్‌లో భద్రతా వైఫల్యానికి నేరుగా కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఇందుకు బాధ్యులయిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలి.

కానీ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పక్కనపెట్టి అంతటా తానే అధికారం చలాయిస్తున్నారు. కేంద్ర సర్కారు వెన్నుదన్నుతో కాశ్మీర్ ప్రజానీకం చేసిన విముక్తి పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు చురుగ్గా సాగిస్తున్నారు.

కాశ్మీర్ రాజు ఫ్యుడల్ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన 22 మంది వీరుల జ్ఞాపకార్థం ప్రకటించిన సెలవు దినాన్ని రద్దు చేసి కాశ్మీర్ రైతాంగాన్ని, ప్రజా వ్యతిరేకతను అణిచివేసిన మహారాజు పుట్టినరోజును సెలవు దినంగా ప్రకటించారు. 22 మంది అమరవీరులకు రాష్ట్ర ముఖ్యమంత్రి సహా వివిధ రాజకీయ పార్టీల నాయకులు నివాళులు అర్పించడానికి అనుమతించకుండా నిర్బంధం విధించారు. ఇది రాజ్యాంగంలోని సమాఖ్యతత్వం మీదా, ప్రజాస్వామిక హక్కులమీద దాడి వినా మరొకటి కాదు.

ఆర్టికల్ 370ను రద్దు చేసి జమ్ము, కాశ్మీర్ లను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా ప్రకటించి ఐదేళ్ళు కావస్తున్నది. ఈ నిర్ణయం అమలుతో ముడిపడి ఉన్న లక్ష్యాలుగా కేంద్రప్రభుత్వం ప్రకటించిన జాబితాలో ఏ ఒక్క లక్ష్యమూ ఈ నాటికీ నెరవేరలేదు. ఉగ్రవాదాన్ని నిర్మూలించి జమ్ముకాశ్మీర్ ప్రజానీకానికి రక్షణ కల్పిస్తాం అన్న వాగ్దానాన్ని నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యింది. గత ఐదేళ్ళ కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష అధికార పర్యవేక్షణలో సాగిన పాలన జమ్ము–కాశ్మీర్ ప్రజల ప్రజాస్వామిక హక్కులను ఒక పథకం ప్రకారం కాలరాసింది. జమ్ము, కాశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలను అభివృద్ధి చేసి చూపిస్తాం అన్న బిజెపి కేంద్ర ప్రభుత్వ వాగ్దానం నీటిమూటగా మిగిలిపోయింది. ప్రజలలో తీవ్ర అసంతృప్తికి దారి తీసింది. జమ్ము–కాశ్మీర్‌లకు రాష్ట్రప్రతిపత్తిని, స్వయంపాలనాధికారాన్ని కల్పించాలనే డిమాండ్ సాధన కోసం ప్రజలను పెద్ద ఎత్తున కదిలించాలి.

'ఆరునెలల్లో రాష్ట్రప్రతిపత్తిని పునరుద్ధరిస్తాం' అంటూ ఆర్టికల్ 370 రద్దు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. ఐదేళ్ళు కావస్తున్నా ఆ హామీ అమలుకావడం లేదు కాబట్టి తక్షణమే రాష్ట్రప్రతిపత్తిని ఇచ్చేలా కేంద్రాన్ని ఆదేశించమని సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తే పహల్‌గావ్ ఉగ్రవాద దాడిని సాకుగా చూపి 'ఇది తగిన సమయం కాదు' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం దురదృష్టకరం.

**బెంగాలీల బహిష్కరణ :** ఆపరేషన్ సిందూర్ దరిమిలా వివిధ రాష్ట్రాలలో బెంగాలీ భాష మాట్లాడుతున్న ప్రజానీకం మీద ముఖ్యంగా బెంగాలీ ముస్లింల మీద దాడులు జరుగుతున్నాయి. బిజెపి పాలిత ఢిల్లీ, ఒడిషా, అసోం, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలలో బెంగాలీలపై బంగ్లాదేశీయులు అన్న ముద్రవేసి, చట్టబద్ధంగా ఎలాంటి పరిశీలన జరపకుండానే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని చిత్రహింసలకు గురి చేస్తున్నారు. భారతీయ పౌరులను అనేక మందిని బలవంతంగా భూ, సముద్ర మార్గాల ద్వారా బంగ్లాదేశ్‌కు పంపేస్తున్నారు. దేశవ్యాప్తంగా బెంగాలీల మీద జరుగుతున్న ఈ దాడులను, బహిష్కరణలను నిలవరించడానికి ఎక్కడికక్కడ మన పార్టీ జోక్యం చేసుకోవాలి.

**అసోంలో బలవంతపు గెంటివేతలు :** అసోం ప్రభుత్వం పెద్ద సంఖ్యలో ప్రజలను వారి వారి అధికారిక నివాస ప్రాంతాల నుండి బలవంతాన ఖాళీ చేయిస్తున్నది. ఈ నిర్బంధ గెంటివేతల ద్వారా మతపరమైన సమీకరణను బలోపేతం చేసుకోవడానికి స్వయానా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రే పూనుకుంటున్నాడు. అసోం ప్రభుత్వం ఇప్పుడు నిర్బంధంగా నిర్వాసితులను చేస్తున్న ప్రాంతాల్లో విలువైన ఖనిజ వనరులు ఉండడంతో, ఈ భూములను ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకు కట్ట బెట్టాలనే దుర్బుద్ధితో వ్యవహరిస్తున్నది. అసోం సహా మిగిలిన అన్ని ఈశాన్య రాష్ట్రాలలో జాతి/మత పరమైన విభజనలు సృష్టించి తద్వారా బిజెపి, ఆర్.యస్.యస్‌లు ఆయా రాష్ట్రాలో తమ పునాదిని బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. అంతర్జాతీయ సరిహద్దులకు దాపున ఉన్న ఈ రాష్ట్రాలలో స్వీయ రాజకీయ లబ్ధి కోసం బిజెపి ఎగదోస్తున్న ఈ వైషమ్యాలు అంతిమంగా మన దేశ సమగ్రతకు, సార్వభౌమత్వానికి ప్రమాదకరంగా పరిణమిస్తాయి.

**వలసలు-విదేశీయుల బిల్లు :** ఈ ఏడాది జరిగిన బడ్జెట్ సమావేశాల్లో బిజెపి ప్రభుత్వం వలసలు-విదేశీయుల బిల్లు 2025ను ప్రవేశ పెట్టింది. ఇది రాజ్యాంగం కల్పించిన రక్షణలను దెబ్బ తీసేందుకు ఉద్దేశించినదే. పాస్‌పోర్ట్ చట్టం-1920, విదేశీయుల రిజిస్ట్రేషన్ చట్టం-1939, విదేశీయుల చట్టం-1946, వలసల చట్టం-2000, ఈ నాలుగు చట్టాలను రద్దు చేస్తూ కొత్తగా ప్రవేశపెట్టిన ఈ బిల్లు ద్వారా 'ఇమ్మిగ్రేషన్' అధికారులకు అపరిమితమైన అధికారాలు కట్టబెడుతున్నది. మనదేశంలోకి ఏ వ్యక్తి అయినా ప్రవేశించడానికిగానీ, ఉండడానికి గానీ, దేశం విడిచి వెళ్ళడానికి గానీ అనుమతించే, నిరాకరించే అధికారం ఇమ్మిగ్రేషన్ అధికారికి కట్టబెట్టారు. సదరు అధికారి నిర్ణయమే అంతిమం. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా అప్పీల్ చేసుకునే వెసులుబాటు ఈ చట్టంలో కల్పించలేదు. ఎన్నికయిన ప్రజాప్రతినిధుల ప్రభుత్వానికి కాకుండా కేవలం అధికారులకు ఇలాంటి విస్తృత అధికారాలు కల్పించడం ద్వారా ఏకపక్ష బహిష్కరణలు, జాతివివక్ష, వలసవచ్చి దీర్ఘ కాలంగా ఈదేశంలో స్థిరపడిన వారి గెంటివేతలు పెరిగిపోయే అవకాశాలు ఎక్కువ అవుతాయి. 'వలస నియంత్రణ' పేరిట మైనార్టీలు, అసమ్మతి వాదులు, రాజకీయ ప్రత్యర్థులపై వేధింపులు పెరుగుతాయి. ఆర్.యస్.యస్, బిజెపిలు తమ మతతత్వ నిరంకుశాధికారాలు చలాయించడానికి అనువుగా

ఈ బిల్లును రూపొందించారే తప్ప ఇది వలస చట్టాల్లో సంస్కరణలు తీసుకురావడం కానేకాదు. అంతర్జాతీయ చట్టాలు, మనం రూపొందించుకున్న రాజ్యాంగంలోని న్యాయం, సమానత్వం, మానవీయ గౌరవాలకు ఈ బిల్లు భంగం కలిగిస్తుంది.

**మణిపూర్ :** 2023 మే నెలలో మణిపూర్‌లో మెయితీ, కుకీ తెగల మధ్య రాజుకున్న వైషమ్యాలు రెండేళ్ళుగా కొనసాగుతున్నా ప్రధాని మోడీకి ఆ రాష్ట్ర సందర్శనకు ఇప్పటికి తీరిక చిక్కింది. ఈ సందర్శన ఆలస్యం కావడమే కాదు పూర్తిగా అలంకార ప్రాయమైనది. క్షేత్ర స్థాయిలో నెలకొని ఉన్న తీవ్రమైన మానవీయ సంక్షోభాన్ని పరిష్కరించడానికి తగిన ఏ చర్యలూ చేపట్టలేదు. నిర్వాసితులకు ఇళ్ళు కట్టిస్తాం అని, రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతున్నాం అని ప్రకటించడం తప్ప తక్షణమే బాధితులకు న్యాయం అందించడం, రక్షణ కల్పించడం, ఇరువర్గాల మధ్య సయోధ్య కుదర్చడానికి ఎంత మాత్రం ప్రయత్నించలేదు.

2025 సెప్టెంబరు నాటికి దాదాపు 57,000 కుటుంబాలు నిర్వాసితులుగా మారి 280 సహాయక శిబిరాలలో తలదాచుకుని ఉన్నారు. ఈ కుటుంబాలకు ఇప్పటికీ చాలినంత తిండి, వైద్య సదుపాయాలు, విద్య గరిపేందుకు తగిన ఏర్పాట్లు కరువయ్యాయి. ఇళ్ళు లేక జీవనోపాధి కోల్పోయిన మూలంగా వివిధ తెగల ప్రజాసముదాయాలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయి. ప్రభుత్వం మూడు దశల పునరావాస పథకాలను ప్రకటించినా మెజార్టీ ప్రజానీకం ఇప్పటికీ ఇళ్ళకు తిరుగుముఖం పట్టలేదు.

మణిపూర్‌లోని రెండు ప్రధాన తెగల ప్రజానీకం మధ్య నెలకొన్న చీలిక ఆ తెగల ప్రజానీకానికి రక్షణ కల్పించడంలో, రాజ్యాంగపరమైన హక్కులు కాపాడడంలో రాష్ట్ర ప్రభుత్వ ఘోర వైఫల్యాన్ని సూచిస్తుంది. హింసకు, నిరాశ్రయతకు కారణమైన నిందితులను చట్టప్రకారం శిక్షించకపోవడంతో వ్యవస్థ పట్ల బాధితులలో నమ్మకం పూర్తిగా సడలిపోయింది. కాబట్టి బాధితులకు రక్షణ కల్పించడం, తగిన న్యాయం చేకూర్చడం, వారి సమస్యలను పరిష్కరించడానికి తక్షణమే తగిన చర్యలు చేపట్టకపోతే మణిపూర్ ఎప్పటికీ జాతి వైషమ్యాల చీలిక నుండి తేరుకోలేదు.

## మతపరమైన విభజన

**ప్రధాని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం :** స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగ సందర్భాన్ని ఉపయోగపెట్టుకుని ప్రధాని నరేంద్ర మోడీ స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి పాత్ర పోషించని ఆర్.యస్.యస్‌ను, ఆ సంస్థ శతజయంతి సందర్భాన్ని ఆకాశానికి ఎత్తి మరీ పొగిడేసారు. వివిధ సంస్కరణలను ప్రకటిస్తూ జనాభా ప్రాతిపదిక ప్రణాళికను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. చొరబాటుదారుల పేరిట ముస్లిం మైనార్టీల వేధింపునకు ఇది దారి తీస్తుంది. ముస్లింలు అందరినీ విదేశీయులు, చొరబాటుదారులు, వాళ్ళని ఈ దేశం నుండి వెళ్ళగొట్టాలన్న ఆర్.యస్.యస్ సిద్ధాంతానికి కార్యరూపం ప్రకటిచడమే ఇది.

**ఆర్.యస్.యస్ చీఫ్ విద్వేషకర వ్యాఖ్యలు :** ఢిల్లీలో జరిగిన ఎంపిక చేసిన ప్రతినిధుల మూడు రోజుల సమావేశాన్ని ఉద్దేశించి ఆర్.యస్.యస్ సర్‌సంఘ్‌చాలక్ ప్రసంగిస్తూ

మధుర, కాశీ వివాదాలను మరలా రేగకొట్టాడు. ఈ రెండు ప్రాంతాలలో ఉన్న మసీదులను వదులుకొని ముస్లింలు సహోదరత్వ భావనను నిరూపించుకోవాలి అని షరతులు విధించాడు. బాబ్రీ మసీదు విధ్వంసం తరువాత – ఈ హేయమైన చర్యకు ఆర్.యస్.యస్‌దే పూర్తి బాధ్యత – 1947 నాటి ప్రార్థనా స్థలాలలో ఎటువంటి మార్పులు చేపట్టరాదని పార్లమెంట్ చట్టం చేసింది. ఈ చట్టాన్ని అనుసరించి మధుర, కాశీలలో సహా దేశంలోని అన్ని ప్రార్థనా స్థలాల యథాతథస్థితి కొనసాగించాలి. కానీ ఆర్.యస్.యస్ మాత్రం ఈ చట్టాన్ని కూడా లెక్క చెయ్యకుండా మన లౌకిక రాజ్యాంగాన్ని ధ్వంసం చేసయినా హిందూ రాజ్యం స్థాపించాలన్న దుష్ట తలంపుతోనే పని చేస్తున్నదని అర్థం చేసుకోవడానికి ఈ వ్యాఖ్యలు ఉపకరిస్తాయి.

సమస్యల నుండి ప్రజల దృష్టిని పక్క దోవ పట్టించడానికి, మతాభినివేశాలను రెచ్చగొట్టి ఉద్రిక్తతలు రాజెయ్యడం సమాజాన్ని మత ప్రాతిపదికన చీల్చడమే వాళ్ళ లక్ష్యం. మోహన్‌భాగవత్ వ్యాఖ్యలు భారత రాజ్యాంగానికి, చట్టానికి వ్యతిరేకమైనవి.

సమీప భవిష్యత్తులో వివిధ కీలక రాష్ట్రాలలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బిజెపి ప్రభుత్వం పట్ల ప్రజలలో నెలకొన్న వ్యతిరేకతను దారి మళ్ళించడానికే ఆర్.యస్.యస్ చీఫ్ ఇలాంటి విచ్ఛిన్నకర వ్యాఖ్యలకు పాల్పడ్డాడు. ఆర్థిక పరిస్థితులు దిగజారిపోయి ప్రజలు అనేక భారాలతో సతమతమవుతున్న ప్రతిసారీ ఆర్.యస్.యస్ దాని అనుబంధ సంస్థలు మత విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా ప్రజల దృష్టిని మళ్ళిస్తూనే వచ్చాయి. వాటి చరిత్రే అటువంటిది.

**మహిళలు, దళితులు, ఆదివాసులపై పెరుగుతున్న దాడులు :** దేశంలోని వివిధ ప్రాంతాల్లో ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలు, దళితులు, ఆదివాసులపై జరుగుతున్న దాడులు నానాటికీ పెరుగుతూ ఉన్నాయి. కర్నాటకలోని ధర్మస్థలలో గత కొన్నేళ్ళుగా అనేకమంది మహిళలను హత్య చేసి సామూహికంగా ఖననం చేసిన వార్తలు, అందులోనూ కొంతమంది లైంగికంగా దాడికి గురయ్యారనే వార్తలుగానీ, పశ్చిమ బెంగాల్ లో ఆర్.జి.కార్ మెడికల్ కాలేజీలో 31 ఏళ్ళ ట్రైనీ డాక్టర్ బలాత్కారానికి గురయి హత్య కావించబడిన ఘటనగానీ, 24 ఏళ్ళ లా విద్యార్థిని కలకత్తా కాలేజీ క్యాంపస్‌లోనే లైంగిక దాడికి గురయిన ఘటన గానీ – వీటన్నింటా అధికార యంత్రాంగం సాక్ష్యాలను తారుమారు చెయ్యడానికి ప్రయత్నించడం అత్యంత విచారకరం. ఈ ఘటనలు వ్యవస్థాగత వైఫల్యానికి నిదర్శనం. బాధితులకు బాసటగా నిలబడడం, నిష్పాక్షికంగా విచారణ జరిపి నిందితులకు కఠిన శిక్షలు విధింపబడేలా చూడడం మన బాధ్యత.

**కేరళ గవర్నర్ అనుచిత చర్యలు :** కేరళ గవర్నరు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ఆర్.యస్.యస్, హిందూత్వ భావజాలాన్ని ప్రచారం చేస్తున్నాడు. రాజ్‌భవన్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో కావాలనే

అఖండ భారత్ మ్యాప్‌ని, భరతమాత చిత్రపటాలను బహిరంగంగా ప్రదర్శించాడు. రాజ్యాంగపరంగా ఈ చిహ్నాల ప్రదర్శన అనుచితం.

గవర్నర్ అధికారిక కార్యక్రమాలను రాజ్యాంగానికి లోబడి నిర్వహించాలని ఎన్నికయిన ప్రజా ప్రభుత్వం – కేరళ వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం ఇచ్చిన సలహాను పెడచెవిన పెడుతున్నాడు. కేరళ ప్రభుత్వం కట్టుబడిన లౌకిక విలువలను పూర్వపక్షం చేస్తూ ఆర్.యస్.యస్ దాని అనుబంధ సంఘాలను చురుకుగా ప్రోత్సహిస్తున్నాడు. గవర్నర్ అనుచిత చర్యలను ఎండగడుతూ కేరళ విద్యార్థి సంఘాలు భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. గవర్నర్ల అధికారాల మీద సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తదనంతరం కేరళ ప్రభుత్వం వేసిన పిటిషన్లను ఉపసంహరించుకోవాలన్న నిర్ణయానికి కేంద్రంలోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం అడ్డం కొడుతున్నది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కేవలం తమిళనాడుకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా గవర్నర్ల వ్యవస్థ అంతటికీ వర్తిస్తుంది కాబట్టి కేరళ ప్రభుత్వం ఇదే అంశం మీద వేసిన పిటిషన్‌లు అప్రస్తుతం కాబట్టి వాటిని ఉపసంహరించుకోవాలని వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రం ఈ నిర్ణయానికి అడ్డుపడడం ద్వారా కేరళలోని విశ్వవిద్యాలయాల కులపతుల నియామక అంశాన్ని ముందుకు సాగనియ్యని గవర్నర్ చర్యలకు మరింత సమయం దక్కించాలనే ఆలోచనతో ఉన్నట్లు స్పష్టమవుతున్నది. కేరళ హైకోర్టు కూడా ఈ విషయమై గవర్నర్ వైఖరిని తప్పు పట్టింది. కేరళ ఉన్నత విద్యావ్యవస్థను దెబ్బ తియ్యడమే లక్ష్యంగా గవర్నర్ పని చేస్తున్నాడు.

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సేతుబంధ విద్వాన్‌యోజన పథకం కింద గురుకులాలలో ఐదేళ్ళ పాటు విద్యను అభ్యసించిన వారికి ప్రతిష్ఠాత్మక ఐఐటిలలో పరిశోధక విద్యార్థులుగా చేరేందుకు అవకాశం కల్పిస్తున్నది. ఇందుకు సంప్రదాయ విద్య చదవాల్సిన అవసరం లేదు. కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం మార్గదర్శకత్వంతో నడిపే ఈ గురుకులాల్లో వేదాలు, మనుస్మృతి, వేద గణితం వంటివి మాత్రమే నేర్పిస్తారు. విద్యలో ఆర్.యస్.యస్ అజెండాను చొప్పించే ప్రయత్నమే ఈ పథకం లక్ష్యం.

**కీలడిపై పురావస్తు శాఖ నివేదిక :** తమిళనాడులోని మదురై దగ్గర ఉన్న కీలడి ప్రాంతంలో పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల నివేదికలో అక్కడ ప్రాచీనకాలపు ఆధునిక నాగరికత విలసిల్లింది అని రూఢి పరుచుకోవడానికి తగిన సాక్ష్యాలు లభించాయని పేర్కొన్నారు. ఈ దేశంలో ఆర్యులే మూలవాసులు, ప్రాచీన భారత చరిత్ర ఆర్యులతోనే మొదలయ్యింది అని గొప్పలు ప్రచారం చేసే ఆర్.యస్.యస్, సంఘపరివార శక్తుల కథనాలు తప్పుడువని ఈ నివేదిక బట్టబయలు చేస్తున్నది. అయితే చరిత్రను వక్రీకరించి ఆర్.యస్.యస్ సైద్ధాంతిక భావజాలానికి అనుగుణంగా ఈ నివేదికను తిరగరాయాలని శాస్త్ర పరిశోధకుల మీద కేంద్రం ఒత్తిడి తీసుకువస్తున్నది. ఆర్.యస్.యస్, సంఘపరివార్‌లు చారిత్రక సత్యాలను

తమ భావజాలానికి అనుగుణంగా మలచడానికి ఎంతకి దిగజారుతాయి అనే దానికి ఇదొక ఉదాహరణ.

**పార్లమెంటు సమావేశాలు :** పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీల తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. బీహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై చర్చకు ప్రభుత్వం అనుమతించలేదు. ప్రతిపక్ష పార్టీల నిరసనల మధ్యనే మోడీ ప్రభుత్వం గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణల) సవరణ బిల్లు, అణుఇంధన చట్ట సవరణ బిల్లు, అణు ప్రమాదాల సందర్భంగా పౌరనష్ట పరిహార సవరణ బిల్లు, క్రీడల విధానం మీద బిల్లులను ప్రవేశ పెట్టింది. ఈ బిల్లులు రాష్ట్రాల హక్కులను హరించివేసే స్వభావం కలిగి ఉన్నాయి.

కీలకమైన దేశ ఖనిజ, లవణ వనరులను ప్రైవేటు, విదేశీ కంపెనీలు కొల్లగొట్టేందుకు ఖనిజ, లవణాల సవరణ బిల్లు వెసులుబాటు కల్పిస్తుంది. దేశ ప్రయోజనాలకు హానికరమైన ఈ బిల్లును వ్యతిరేకించి తీరాలి.

ఈ బిల్లులపై లోతైన చర్చలకు అవకాశం కల్పించకుండా మోడీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించింది. దేశహితానికి, ప్రజాప్రయోజనాలకు సంబంధించిన బిల్లులపై పార్లమెంటులో సజావుగా చర్చలు జరిగే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించడం లేదు. పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజాజీవితాలను ప్రభావితం చేసే ప్రతి బిల్లుపై పార్లమెంటులో లోతైన చర్చ జరిగేలా బాధ్యత తీసుకోవాలి.

**ఉపరాష్ట్రపతి ఎన్నికలు :** జగదీప్ ధన్‌కర్ హఠాత్తుగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చెయ్యడంతో ఎన్నిక అనివార్యమయ్యింది. ఇండియా బ్లాక్ పార్టీలు సమావేశమై ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేని రాజ్యాంగ విలువల పట్ల అపారమైన పరిజ్ఞానంగల సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని తమ అభ్యర్థిగా నిలబెట్టాయి. ఇండియా బ్లాక్ నుండి నిష్క్రమించిన ఆమ్ ఆద్మీ పార్టీ కూడా జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరిచింది. సంఖ్యాబలం విజయానికి అనువుగా లేనప్పటికీ బిజెపి/ఆర్.యస్.యస్‌ల హిందూత్వ భావజాల పార్టీ రాజ్యాంగ విలువలైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమానత్వ భావనలపై చేసే దాడికి వ్యతిరేకంగా బలమైన ప్రతిఘటనా సంకేతాలు ఇచ్చింది ఈ పోటీ. ఇండియా బ్లాక్ పార్టీల నుండి కొంత క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలియవస్తుంది. ఆయాపార్టీలు ఈ పరిణామాన్ని లోతుగా పరిశీలించుకోవాలి.

### భారత ఆర్థిక వ్యవస్థ – కొనసాగుతున్న నయా ఉదారవాద దాడులు

బిజెపి ప్రభుత్వ ఘన విజయాలు అంటూ ఎంతటి భారీ ప్రచారం కొనసాగించుకుంటున్నా మనదేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. నిజ వేతనాల్లో తగ్గుదల, ద్రవ్యోల్బణం పెరుగుదల మూలంగా ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయింది. దీనితో ఉత్పత్తి దెబ్బతిన్నది. దేశీయ పారిశ్రామిక కంపెనీలు ఉత్పత్తి

సంబంధిత కార్యకలాపాల్లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం లేదు. భారతీయ పారిశ్రామిక సంస్థల దగ్గర ప్రస్తుతం 10.7 లక్షల కోట్ల రూపాయల నగదు నిల్వలు ఉన్నాయి. కానీ ఈ కంపెనీలు కొత్తగా పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా లేవు. 2025-26 తొలి త్రైమాసికంలో 2 లక్షల కోట్ల రూపాయల విలువ చేసే విదేశీ ప్రాజెక్టులు నిలిచిపోయాయి. 2010 తర్వాత ఇంత పెద్ద మొత్తంలో ప్రాజెక్టులు నిలిచిపోవడం ఇదే మొదటి సారి అని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సి.యం.ఐ.ఇ) స్పష్టం చేసింది.

2025 జూన్ నాటికి పారిశ్రామికోత్పత్తి వృద్ధిరేటు గత 10 నెలల కనిష్ట స్థాయి 1.5 శాతానికి చేరుకున్నది. గనుల రంగం గత 58 నెలలలో చవిచూడనంతటి అధమ స్థాయికి పడిపోయింది.

**వేతనాలు - నిరుద్యోగం :** 2025 ఆర్థిక సంవత్సరంలో 'నిఫ్టి' సూచికలో పై స్థాయిన ఉన్న 50 కంపెనీలలో జీతాల వృద్ధి కేవలం 5 శాతంగానే ఉన్నది. గత నాలుగేళ్ళతో పోలిస్తే ఇది అత్యల్ప వృద్ధి రేటు. అంతర్జాతీయ డిమాండ్‌లో నెలకొన్న అనిశ్చితి, కృత్రిమ మేధ ద్వారా పునర్వ్యవస్థీకరణల దృష్ట్యా ఐ.టి. కంపెనీలలో జీతాల పెరుగుదల నామమాత్రంగానూ, ప్రతికూలంగానూ ఉన్నది. దీనిమూలంగా వినియోగదారుల సెంటిమెంట్ సూచిక ఆగస్టు నెలలో 1.8 శాతం పడిపోయింది.

ప్రభుత్వం నిర్వహించే పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేను అనుసరించి 2025 జూన్ నాటికి దేశంలో నిరుద్యోగం వృద్ధి రేటు 5.6 శాతంగా ఉన్నది. మే నెలలో ఇది 5.1 శాతంగా ఉన్నది. జూలై నెలలో ఇది స్వల్పంగా 5.2 శాతానికి తగ్గింది. అయితే సి.యం.ఐ.ఇ నివేదికలు నిరుద్యోగం వృద్ధిరేటు 7 శాతంగా ఉన్నదని పేర్కొన్నది. 20-24 ఏళ్ళ వయస్కులయిన యువతలో 44.5 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారని, వీరిలో చాలామంది డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్య పూర్తి చేసినవారే అని సి.యం.ఐ.ఇ నివేదిక పేర్కొన్నది. 'ఇండియా స్కిల్స్ రిపోర్ట్' 2025 ప్రకారం 54.8 శాతం మంది భారతీయ గ్రాడ్యుయేట్లు ఉద్యోగాలకు అర్హులే అని లెక్క తేల్చింది. వస్తూత్పత్తి రంగంలో ఉపాధి 2004లో 10.5 శాతం నుండి 2012లో 12.8 శాతానికి పెరిగి 2024 నాటికి 11.5 శాతానికి పడిపోయింది. అధికారిక ప్రచార శీర్షికలలో వెల్లడిస్తున్న అంకెలు ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో నిరుద్యోగం ప్రబలంగా ఉందని స్పష్టమవుతున్నది.

అసంఘటిత రంగ పరిశ్రమల త్రైమాసిక బులెటిన్ వివరాలను అనుసరించి జనవరి-మార్చి 2025 నాటికి 78.5 మిలియన్లుగా ఉన్న పరిశ్రమల సంఖ్య ఏప్రిల్-జూన్ 2025 నాటికి 79.4 మిలియన్లకు పెరిగింది కానీ కార్మికుల సంఖ్య 131.3 మిలియన్‌ల నుండి 128.6 మిలియన్లకు తగ్గినట్లు తెలియవస్తున్నది. స్వయం ఉపాధి మీద ఆధారపడిన వారి సంఖ్య 58.3 శాతం నుండి 60.2 శాతానికి పెరిగింది. అసంఘటిత రంగంలో పరిశ్రమల

సంఖ్య పెరిగినప్పటికీ కార్మికుల సంఖ్య తగ్గిపోవడం ఉపాధి అవకాశాలు కోల్పోవడాన్ని సూచిస్తున్నది.

2030 నాటికి మన దేశంలో కష్టించి పనిచేసే సామర్థ్యం ఉన్న వారి సంఖ్య ఏటా 12 మిలియన్లు పెరుగుతూ వస్తుంది అనేది ప్రభుత్వ అంచనాయే. వీరందరికీ పని కల్పించాలంటే ఏటా 9 మిలియన్ల ఉద్యోగావకాశాలు సృష్టించాలి. ప్రస్తుతం కొనసాగుతున్న సుంకాల విధింపు మూలంగా టెక్స్టైల్స్ వంటి లేబర్ ఇంటెన్సివ్ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తీవ్రమైన ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. అనేక వ్యాపారాలు మూతబడుతున్నాయి. నిరుద్యోగం మరింత పెచ్చరిల్లే అవకాశం ఉన్నది. కాబట్టి యువతరానికి నష్టకరంగా పరిణమించే ఈ అంశంపైన కేంద్రం దృష్టి పెట్టాలి.

**భారత్‌పై సుంకాలు :** అమెరికా మనదేశంపై 50 శాతం సుంకాలు విధించింది. గడువులోగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనందుకు 25 శాతం, రష్యా నుండి చమురు, సహజ వాయువులు కొనుగోలు చేస్తున్నందుకు మరో 25 శాతం – మొత్తంగా 50 శాతం సుంకాలు అని లెక్క చెప్పింది. ఈ సుంకాల మూలంగా మన దేశ ప్రధాన ఎగుమతి రంగాలు అయిన వ్యవసాయం, చేపల, రొయ్యల సాగు, టెక్స్టైల్ తదితర చిన్న మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతింటాయి. రష్యా నుండి మనం చమురు, సహజ వాయువుల కొనుగోళ్ళు నిలిపివేస్తే ఇంధన ధరలు ప్రియం అయిపోయి అన్ని సరుకుల, వస్తువుల ధరలు పెరిగిపోతాయి.

అమెరికా సుంకాల బెదిరింపుకు తలొగ్గి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వాషింగ్టన్‌ను బుజ్జగించడానికి రష్యా నుండి చమురు దిగుమతులు తగ్గించుకున్నది. గత ఏడాది జూన్ నాటికి మన చమురు దిగుమతులలో రష్యా వాటా 43 శాతం కాగా ఈ ఏడాది జూలై నాటికి 33 శాతానికి తగ్గింది. ఈ కోత కూడా ప్రభుత్వరంగ చమురు పరిశ్రమలు అయిన ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందూస్థాన్ పెట్రోలియంలకే పరిమితం చేసింది. రష్యా దిగుమతులను తగ్గించుకోవడం ద్వారా మనదేశం ఆ వారా అమెరికన్ బహుళ జాతి సంస్థల నుండి కొనుగోళ్ళు చెయ్యాలనేది ట్రంప్ వ్యూహం. ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోవడానికి అమెరికా నుండి ఆయుధాలు, పౌర విమానాలు కొనుగోలు చెయ్యడానికి మోడీ ప్రభుత్వం సిద్ధపడింది.

అయినా ట్రంప్ ప్రభుత్వం ఎలాంటి రాయితీలు ఇవ్వకపోవడంతో బిజెపి ప్రభుత్వం ఇతర వర్ధమాన దేశాల వైపు దృష్టి మరల్చింది. ఆగస్టు నెలలో రష్యానుండి చమురు కొనుగోళ్ళు మరలా పెరిగాయి. అయితే ఇదేమీ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానంలో మార్పునకు సూచిక కాదు. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలతో సంబంధాలు పటిష్ఠం చేసుకునేందుకు, అలాగే 'క్వాడ్' సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నది.

**స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు/ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు :** మనదేశం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్న ఏడు దేశాలలో ఐదు దేశాలతో వాణిజ్యలోటు కలిగి ఉన్నది. ఆసియాన్ దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం మన దేశ ప్రయోజనాలను దెబ్బ తీస్తుంది. ఇలాంటి ఒప్పందాల మీద ముందుగా అన్ని భాగస్వామ్య పక్షాలతో విస్తృతంగా చర్చలు జరిపి ఉంటే ఉపయుక్తంగా ఉండేది. అమెరికా విధించిన సుంకాల నుండి తప్పించుకునే ప్రయత్నంలో తిరిగి అమెరికా ఉచ్చులోనే చిక్కుకుని మన దేశ ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాలలో అమెరికన్ దిగుమతులను అనుమతించింది. వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే తొందరలో మన వ్యవసాయ రంగం, పాడిపరిశ్రమ, ఫార్మా రంగం, రక్షణ రంగం, ఫైనాన్స్ రంగాల్లోకి అమెరికా ఉత్పత్తులు, పెట్టుబడులు అనుమతించడం ద్వారా మనదేశ ప్రయోజనాలకు తీరని నష్టం వాటిల్లే అవకాశం ఉన్నది.

**ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు :** భారతీయ ఇన్సూరెన్స్ కంపెనీల (విదేశీ పెట్టుబడుల) రూల్స్, 2015 చట్టానికి 2025 ఆగస్టు 29 న కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సవరణలు జారీ చేసింది. ఈ సవరణలు పాలసీదారులు, దేశ ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాల పాలిట శరాఘాతంగా పరిణమిస్తాయి. సదరు ఆర్థిక మంత్రిత్వ శాఖ సవరణల మూలంగా ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 74 శాతం నుండి 100 శాతానికి పెంచుకోవడానికి అవకాశం ఏర్పడింది. దీని మూలంగా దేశీయ బీమారంగం దెబ్బ తింటుంది. ప్రస్తుతం దేశీయ బీమా కంపెనీలతో కలిపి 'జాయింట్ వెంచర్' నడుపుతున్న విదేశీ కంపెనీలు ఈ ఒప్పందాల నుండి వైదొలగి స్వంతంగా ఇన్సూరెన్స్ వ్యాపారాన్ని ప్రారంభిస్తాయి. ఇప్పటికే తొమ్మిది విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలు మన మార్కెట్ నుండి నిష్క్రమించి పాలసీదారుల ప్రయోజనాలను గాలికి వదిలేశాయి.

విదేశీ పెట్టుబడులు విపరీతమైన లాభాపేక్షతో ఉంటాయి. దీని మూలంగా ఇన్సూరెన్స్ కంపెనీలు సామాన్య, మధ్యతరగతి ప్రజల, విస్మరణకు గురయిన ప్రజాసముదాయాల ఇన్సూరెన్స్ అవసరాలకు బదులు లాభాలు గరిష్ఠంగా పొందడానికి అవకాశం ఉన్న వైపుకి మళ్ళుతాయి. దేశీయ ఇన్సూరెన్స్ కంపెనీలలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆటోమాటిక్ మార్గాన అనుమతిస్తారు. దీని మూలంగా పాలసీదారుల గోప్యత, భద్రతలకు భంగం కలుగుతుంది. విదేశీ పెట్టుబడుల లాభాపేక్ష ప్రజాసంక్షేమ లక్ష్యాలను పక్కకు నెట్టేస్తాయి. తద్వారా సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వాలకు నష్టం వాటిల్లుతుంది. ఇక్కడ పోగేసుకున్న లాభాలను ఇష్టారాజ్యంగా తరలించుకు పోవచ్చు. దీని మూలంగా మూలధనం కొరత ఏర్పడి దీర్ఘకాలిక ఇన్సూరెన్స్ సొమ్ము చెల్లింపులు దెబ్బ తినిపోతాయి. అలాగే వివిధ దేశీయ ఇన్సూరెన్స్ కంపెనీల టేకోవరు ప్రక్రియ జోరు అందుకుంటుంది. అది కూడా అతి తక్కువ వెలకు ఎగరేసుకుపోవడం మూలంగా మన వనరులకు నష్టం

వాటిల్లుతుంది. కాబట్టి ఈ సవరణలకు వ్యతిరేకంగా ప్రజానీకంలో పెద్ద ఎత్తున ప్రచారం చేసి వారి మద్దతు కూడగట్టుకోవాలి.

**కార్పొరేట్లకు రాయితీలు :** ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింప చేసేందుకు కేంద్ర మంత్రిమండలి భారతీయ కార్పొరేట్ కంపెనీలకు అనేక రాయితీలు ప్రకటించింది. ఎలక్ట్రానిక్ వస్తూత్పత్తి కంపెనీలకు వాటి టర్నోవరు ఆధారంగా ఆరేళ్ళపాటు 22,911 కోట్ల రూపాయల ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఇ-వేస్ట్ నుండి- కీలకమైన ఖనిజాల వేర్పాటు మరియు ఉత్పత్తి పరిశ్రమలకు గతంలో ప్రకటించిన 16,300 కోట్ల రూపాయల పెట్టుబడి రాయితీలకు అదనంగా మరో 1,500 కోట్ల రూ॥లు కేటాయించింది. ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం పేరిట లక్ష కోట్ల రూపాయల నిధిని ఏర్పాటు చేసింది.

జాతీయ టెలికాం ముసాయిదా పాలసీ 2025 ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఫిక్స్‌డ్‌లైన్ బ్రాడ్‌బాండ్ సేవలు కల్పించే కంపెనీలకు, టెలికాం పరిశోధనలు అభివృద్ధికి కృషి చేసే కంపెనీలకు ప్రోత్సాహకాలు కల్పించింది. కానీ ప్రభుత్వ రంగ టెలికాం కంపెనీలకు మొండి చెయ్యి చూపించింది.

బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రజాధనాన్ని ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకు ఎలా దోచి పెడుతుంది అనేదానికి ఇవి కొన్ని ఉదాహరణలు. తద్వారా హిందూత్వ మతతత్వ – కార్పొరేట్ బంధాన్ని బలోపేతం చేసుకుంటున్నది.

వివిధ కార్మిక, పర్యావరణ చట్టాలను బలహీన పరచడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల దోపిడికి పట్టపగ్గాలు లేకుండా చేసింది. మోడీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగానంతరం నయా ఉదారవాద విధానాలను మరింత దూకుడుగా అమలు చెయ్యడానికి నీతి ఆయోగ్ నియంత్రణా చట్టాల ఉల్లంఘన, అమలులో వైఫల్యాలను శిక్షార్హమైన నేరంగా పరిగణించకుండా ఉండేందుకు తగిన సిఫార్సులు చెయ్యడానికి రెండు అత్యున్నత స్థాయి కమిటీలను నియమించింది. ఇది కార్మికవర్గ హక్కులను తీవ్రంగా దెబ్బతియ్యడమే.

**జి.యస్.టి శ్లాబ్ ల సవరణ :** కేంద్ర ప్రభుత్వం జి.యస్.టి కౌన్సిల్ సమావేశం నిర్వహించి కొన్ని వస్తువులపై జి.యస్.టి రేట్ల తగ్గింపుతో పాటు జి.యస్.టి శ్లాబ్ లను కూడా కుదిస్తూ ఒక ప్రకటన చేసింది. సామాన్య ప్రజానీకం వినియోగించే నిత్యవసరాలు, ఇన్సూరెన్స్ పాలసీల మీద జి.యస్.టి తగ్గింపు ఆహ్వానించదగినదే. అయితే ఈ తగ్గింపు లబ్ధి కార్పొరేట్ కంపెనీలు దిగమింగకుండా సామాన్య ప్రజలకు చేరేలా చూసే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలి. విలాస వస్తువులపై జి.యస్.టి పెంపు చేపట్టడం అవసరం. అలాగే ఈ ప్రక్రియ మూలంగా రాష్ట్రాల ఆదాయాలకు వాటిల్లే నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం సర్దుబాటు చెయాలి. అలాగే వస్తూత్పత్తి రంగంలో ఉన్న బడా కార్పొరేట్ కంపెనీలకు, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు మధ్య ఉండే అంతరాల దృష్ట్యా రెండవ తరగతికి చెందిన పరిశ్రమల ప్రయోజనాలు కాపాడాలి.

**జూలై 9 సార్వత్రిక సమ్మె :** పది కేంద్ర కార్మిక సంఘాలు, వివిధ ఆలిండియా ఫెడరేషన్‌లు ఇచ్చిన జూలై 9 సార్వత్రిక సమ్మె పిలుపు విజయవంతం అయ్యిందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు కూడా ఈ సమ్మెలో విరివిగా పాల్గొన్నాయి. అనేక ప్రాంతాలలో పార్టీ శాఖలు సమ్మె చేస్తున్న కార్మిక వర్గానికి సంఘీభావ ప్రదర్శనలు నిర్వహించాయి. ఈ సమ్మెలో పార్టీ సభ్యుల, కార్యకర్తల ప్రత్యక్ష భాగస్వామ్యం గురించి తదుపరి కేంద్ర కమిటీ సమావేశం క్షుణ్ణంగా సమీక్షించాలి.

**ప్రకృతి ఉత్పాతాలు :** హిమాలయాలలో సంభవించిన ప్రకృతి ఉత్పాతాల మూలంగా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, కాశ్మీర్‌లో తీవ్ర ఆస్తి నష్టం వాటిల్లింది. ఇక్కడ సహజ వనరులను అభివృద్ధి ప్రాజెక్టుల పేరిట ఇష్టా రాజ్యంగా కొల్లగొట్టడం మూలంగా పర్యావరణం దెబ్బతిని ఈ విపత్తులు సంభవించాయి. వందలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.

**భవిష్యత్ కర్తవ్యాలు :**

1. సెప్టెంబర్ చివరి వారంలో ట్రంప్ సుంకాల ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచార ఉద్యమం చేపట్టాలి. బిజెపి కేంద్ర ప్రభుత్వం అమెరికా పట్ల ఎలాంటి లొంగుబాటు ధోరణులు ప్రదర్శిస్తుందో తెలియచెప్పే విధంగా కరపత్రాలు బుక్‌లెట్‌లు ప్రచురించి ప్రజలలో విస్తృతంగా పంపిణీ చెయ్యాలి. ఇందుకు సంబంధించిన కరపత్రం పార్టీ ప్రచార-ఆందోళనా సబ్ కమిటీ రూపొందించి రాష్ట్రాలకు పంపుతుంది.
2. దేశ వ్యాప్తంగా పాలస్తీనా ప్రజానీకానికి పెద్ద ఎత్తున సంఘీభావ కార్యక్రమాలు చేపట్టాలి. రాష్ట్ర రాజధాని నగరాలలో ఇతర రాజకీయ పార్టీల సంఘాలు, కళాకారులతో కలిపి భారీ బహిరంగ సభలు నిర్వహించాలి. ఈ క్రమంలో బిజెపి ప్రభుత్వ ఇజ్రాయిల్ అనుకూల విధానాలను ఎండగట్టాలి.
3. అన్ని రాష్ట్ర కమిటీలు ప్రజల జీవనోపాధికి సంబంధించిన దైనందిన సమస్యలపై ఆందోళనా పోరాటాలు నిర్వహించాలి.

*

**ప్రతులు : 1000** **ప్రచురణ కాలం : సెప్టెంబర్, 2025** **వెల : రూ. 10/-**

169208

**ప్రచురణ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ**

**27-30-9, గవర్నర్‌పేట, విజయవాడ - 2**

**ఫోన్ నెం. 0866-2577202**